



www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily


భూముల రీ సర్వే అనంతరం అర్హులైన రైతులందరికీ పాస్ పుస్తకాలు





హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 201, శనివారం 22-8-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam


# చివరి నిమిషంలో రేవంత్ అమెరికా టూర్ రద్దు

- సీఎం రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరణ
- 23న లండన్ నుంచి హైదరాబాద్ చేరుకోనున్న సీఎం
- వచ్చే నెలలో అమెరికా వెళ్లే యోచన
- అమెరికా భేటీలకు అధికారులను పంపే అవకాశం
- 'తెలంగాణ రైజింగ్' ఆగదని సీఎం స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, ఆగస్టు 21**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన చివరి నిమిషంలో రద్దయింది. అమెరికాలో నిర్వహించాల్సిన 'తెలంగాణ రైజింగ్' సమావేశాలకు కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో బ్రిటన్ పర్యటన ముగించుకొని సీఎం ఈ నెల 23న లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి లండన్, అమెరికాలో 'తెలంగాణ రైజింగ్' పేరుతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా అమెరికాలోని బోస్టన్, న్యూయార్క్‌లో సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి కార్యాలయం షెడ్యూల్ కూడా సిద్ధం చేసింది. అయితే చివరి నిమిషంలో కేంద్ర విదేశాంగ శాఖ నుంచి ..మిగతా 2లో

## కాంగ్రెస్ పార్టీ కాదు

# నా టార్గెట్ రేవంత్

## కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు



- సోనియా, రాహుల్, ప్రియాంకపై గౌరవం ఉందన్న సుస్మిత
- రేవంత్, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోందని ఆరోపణ
- 'టికెట్ నిర్ణయించడానికి సీఎం ఎవరు?' అని ప్రశ్న
- స్వతంత్రంగా పోటీ చేసేందుకు సిద్ధమని ప్రకటన
- పరకాల నుంచి పోటీ చేయడం ఖాయమని వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 21 :**

మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కుమార్తె వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ సురేఖ పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు. ఈ తరుణంలో కొండా సుస్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కేవలం సీఎం రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని ఆ వ్యాఖ్యలు చేశానని స్పష్టం చేశారు.

"సీఎం రేవంత్ రెడ్డి పరకాల వచ్చి రేవూరి ప్రకాశ్ రెడ్డికి ఎమ్మెల్యే సీటు ఇస్తున్నట్లు ప్రకటించారు. నేను రేవంత్ రెడ్డిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని వ్యాఖ్యలు చేశాను. పార్టీని కాదు. నాకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మీనాక్షి నటరాజన్‌పై చాలా గౌరవం ఉంది. కానీ, ..మిగతా 2లో

# చెప్పాల్సింది కమిటీకి చెప్పా

## సీఎం వచ్చాక మాట్లాడతా: కొండా సురేఖ

**హైదరాబాద్, ఆగస్టు 21 :**



కాంగ్రెస్ షోకాజ్ నోటీసుల అంశంలో తాను చెప్పాల్సింది క్రమశిక్షణ కమిటీకి చెప్పానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ విషయంపై ఇప్పుడు మీడియాతో మాట్లాడబోనని చెప్పారు. "నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ కమిటీకి చెప్పా. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. సీఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను"అని కొండా సురేఖ అన్నారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మంత్రికి కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌కు వివరణ పంపారు. సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని.. ఈ విషయంలో తనను బాధ్యురాలిని చేయొద్దని అందులో కోరారు. మరోవైపు కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్లు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మంత్రి కుమార్తె చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## కాక్రోచ్ పార్టీ కార్యకర్తలపై

# గ్రామస్థుల దాడి!

- రాజస్థాన్‌లో స్కూల్ తనిఖీకి వెళ్లిన సీజేపీ
- రాంపురా-కన్వర్‌పురా గ్రామంలో ఉద్రిక్తత
- వాహనాలు, మొబైల్ ఫోన్లు ధ్వంసమైనట్లు సీజేపీ ఆరోపణ
- మహిళా కార్యకర్తలపై కూడా దాడి జరిగిందని వెల్లడి
- ఓ కార్యకర్త చేయి విరిగిందని అశుతోష్ రంకా ఆరోపణ
- నిందితులను అరెస్ట్ చేయాలని సీజేపీ డిమాండ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 21:**

రాజస్థాన్‌లో ప్రభుత్వ పాఠశాల పరిస్థితిని పరిశీలించేందుకు వెళ్లిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కార్యకర్తలపై గ్రామస్థులు దాడి చేశారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ ఘటనపై సీజేపీ కో-కన్వీనర్ అశుతోష్ రంకా తీవ్రంగా స్పందించారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయడంతో పాటు విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి 48 గంటల గడువు విధించారు. సంగనేర్‌లోని ..మిగతా 2లో

## కొండా సురేఖపై

# కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆగ్రహం

- కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి
- కాంగ్రెస్ ఎమ్మెల్యేల డిమాండ్!
- 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీల భేటీ
- సుస్మిత వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ
- వ్యాఖ్యలను సురేఖ ఖండించకపోవడంపై అభ్యంతరం

2



# తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట

- రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలంపై జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ
- వేలాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
- గచ్చిబౌలి భూములకు, ఈ భూములకు సంబంధం లేదన్న తెలంగాణ ప్రభుత్వం
- ఏవైనా అభ్యంతరాలుంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచన



**న్యూఢిల్లీ, ఆగస్టు 21 :**

తెలంగాణలోని రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలం ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరిం చింది. ఈ వేలాన్ని నిలిపివేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) .మిగతా 2లో

## ప్రముఖ నటి షావుకారు జానకి కన్నుమూత



2

## పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ ధర్నా



# కాంగ్రెస్ పార్టీ కాదు.. నా టార్గెట్ రేవంత్




**మొదటి పేజీ తరువాయి...**
రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబం అవినీతికి పాల్పడుతోంది. అందుకే వారిని టార్గెట్ చేసుకున్నాను. పైగా ఎమ్మెల్యే టికెట్ ఎవరికివ్వాలో నిర్ణయించడానికి ఆయన ఎవరు? సీడబ్ల్యూసీ సమావేశాల వంటి వ్యవస్థ ఉంది కదా. ఆ ప్రకారంగానే అభ్యర్థులను ప్రకటిస్తారు. నేను అదే ప్రశ్నించాను. నేను స్వతంత్రగా పోటీ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నాను" అని కొండా సుస్మిత ఓ జాతీయ మీడియా ఛానెల్‌తో మాట్లాడుతూ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఖాయమంటూ గీసుకొండలో బుధవారం నాడు సుస్మిత అన్న విషయం తెలిసిందే. ఇటీవల పరకాల బహిరంగ సభలో 'వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలి' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ అలా ఏకపక్షంగా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. సీఎం సోదరుడు పెట్టిన డొల్ల కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమిని కట్టబెట్టారని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని.. తన వ్యాఖ్యలపై కౌంటర్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తే సీఎం కుటుంబం అవినీతిని ఒక్కొక్కటిగా బయటపెడతానన్నారు.

## కొండా సురేఖపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆగ్రహం

**హైదరాబాద్, ఆగస్టు 21 :**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. ఈ అంశంపై ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాలకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు సీఎల్పీ వేదికగా సమావేశమై చర్చిం చారు. అనంతరం కొండా సురేఖను రాష్ట్ర మంత్రివర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను టార్గెట్ చేస్తూ కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఆమె వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కూడా సురేఖకు వ్యతిరేకంగా గళం విప్పారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యేలు మీడియా సమావేశంలో మాట్లాడారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను కొండా సురేఖ ఇప్పటివరకు ఖండించకపోవడాన్ని ఎమ్మెల్యేలు తీవ్రంగా తప్పుబట్టారు. మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలపై బాధ్యత వహించాల్సిందేనని అభిప్రాయపడ్డారు. సీఎంను వ్యతిరేకించే వారికి పార్టీలో ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు. మీ భాష ఎప్పుడూ పార్టీకి నష్టం కలిగించేలా ఉందని కొండా ఫ్యామిలీని ఉద్దేశించి అన్నారు. సుస్మిత వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ చెప్పడంపైనా ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇచ్చిన వివరణ తమకు ఆమోదయోగ్యంగా లేదని తేల్చారు. సీఎం రేవంత్ ఎంతో కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. అలాంటి వ్యక్తిని విమర్శించినప్పుడు ఖండించడం కనీస బాధ్యత అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చాలనే ప్రతిపక్షాల కుట్రలకు బలం చేకూర్చుతున్నారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తులపై కఠిన చర్చలు తీసుకోవాలని అధిష్ఠానాన్ని కోరారు.

## కాక్రోచ్ పార్టీ కార్యకర్తలపై గ్రామస్థుల దాడి!

**మొదటి పేజీ తరువాయి...**
రాంపురా-కన్వర్‌పురా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పరిస్థితిని పరిశీలించేందుకు సీజేపీ బృందం వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు రంకా తెలిపారు. ఆ పాఠశాల కొన్నేళ్లుగా గేదెల కొట్టంలో కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. గతేడాది కూడా తమ బృందం అక్కడికి వెళ్లిందని, పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించలేదని చెప్పారు. తమ బృందం అక్కడికి చేరుకునేలోపే కొంతమంది బీజేపీతో సంబంధం ఉన్న వ్యక్తులు అక్కడ ఉన్నారని, అనంతరం ఒక్కసారిగా దాడి జరిగిందని రంకా ఆరోపించారు. తమ వాహనాల అద్దాలు పగలగొట్టారని, మొబైల్ ఫోన్లు ధ్వంసం చేశారని, మహిళా కార్యకర్తపై దాడి చేశారని చెప్పారు. తన చొక్కా కూడా చించివేశారని పేర్కొన్నారు. ఓ కార్యకర్త చేయి విరిగిందని, తమపై రాళ్ల దాడి కూడా జరిగిందని ఆరోపించారు. పోలీసులకు ముందే సమాచారం ఇచ్చినా వారు ప్రేక్షక పాత్ర పోషించారని రంకా ఆరోపించారు. మహిళా కార్యకర్తలపై కూడా రాళ్లు విసిరి, వారి ఫోన్లు ధ్వంసం చేశారని చెప్పారు. ఈ దాడి ముందస్తు ప్రణాళికతోనే జరిగిందని ఆయన ఆరోపించారు. పాఠశాల తనిఖీలపై విధించిన ఆంక్షలను కూడా వెంటనే ఉపసంహరించుకోవాలని రంకా డిమాండ్ చేశారు. 48 గంటల్లో నిందితులపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈసారి పోరాటం కేవలం పాఠశాలల సమస్యలకే పరిమితం కాదని, మంత్రి మదన్ దిలావర్ రాజీనామాను కూడా డిమాండ్ చేస్తామని స్పష్టం చేశారు. కాగా, సీజేపీ బృందం పాఠశాల ప్రాంగణంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో స్థానిక గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్తత పెరిగింది. ఘటనకు సంబంధించి నిందితుల వివరాలు, పోలీసుల తదుపరి చర్యలపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.



## చివరి నిమిషంలో రేవంత్ అమెరికా టూర్ రద్దు

**మొదటి పేజీ తరువాయి...**
అనూహ్య పరిణామం ఎదురైంది. యూకేలో జరిగే సమావేశాలకు మాత్రమే అనుమతి లభించింది. అమెరికాలో నిర్వహించా ల్సిన సమావేశాలకు గ్రీన్‌సిగ్నల్ రాలేదు. దీంతో సీఎం తన పర్యటనను కుదిం చుకుని హైదరాబాద్‌కు తిరిగి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే, కేంద్రం నిర్ణయం వెనక కారణం ఏంటనేది మాత్రం ఇంకా అధికారికంగా తెలయరాలేదు. ప్రస్తుతం రద్దయిన అమెరికా పర్యటనను వచ్చే నెలలో చేపట్టాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. ఈసారి అమెరికాలో జరగాల్సిన భేటీలకు సీఎం స్వయంగా వెళ్లకుండా అధికారుల బృందాన్ని పంపే యోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ యువత భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా 'తెలంగాణ రైజింగ్' ప్రయాణం ఆగదని ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట

**మొదటి పేజీ తరువాయి...**
రాయదుర్గం పాన్ మక్తాలోని సుమారు 11 ఎకరాల భూమిని వేలం వేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎకరాకు కనీస ధరను రూ.175 కోట్లుగా నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ జువ్వాడి ప్రణయ సింహారావు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ, గతంలో కంచ గచ్చిబౌలిలోని భూముల వేలాన్ని సుప్రీంకోర్టు నిలిపివేసిందని, ప్రస్తుతం ప్రభుత్వం అవే రక్షిత భూములను వేలం వేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన వాదించారు. ప్రస్తుతం వేలానికి ఉంచిన రాయదుర్గం భూములకు, గతంలో స్టే ఇచ్చిన కంచ గచ్చిబౌలి భూములకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ రెండు ప్రాంతాల మధ్య దాదాపు 5 కిలోమీటర్ల దూరం ఉందన్న విషయాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో రాయదుర్గం భూముల వేలం ప్రక్రియకు మార్గం సుగమమైంది.

## పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా

**పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్**

**బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ**

**ఎఫ్ఐఆర్ కోసం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం ముందు ధర్నా**

**జులై 20 నిరసనల్లో పెల్లెట్లు తగిలాయని యువకుడి ఆరోపణ**

**పెల్లెట్ గన్స్ వాడలేదని ఢిల్లీ పోలీసుల వాదన**

**న్యూఢిల్లీ, ఆగస్టు 21 :**

పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు. జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది. అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

## ప్రముఖ నటి షావుకారు జానకి కన్నుమూత

**హైదరాబాద్, ఆగస్టు 21 :**

ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతూ తుది శ్వాసవిడిచారు. ఆమె గత కొంత కాలంగా శ్వాసకోశ, వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల మరోసారి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆమె కన్నుమూశారు. షావుకారు జానకి.. నటి కృష్ణకుమారికి సోదరి. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో 1931 డిసెంబర్ 12న జన్మించారు. చిన్నతనంలోనే నాటకాల్లో పలు పాత్రలు పోషిస్తూ కెరీర్ ప్రారంభించారు. 11 ఏళ్లకు రేడియోలో ఒక తెలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. 1949లో 'రక్షా రేఖ' సినిమాతో చలనచిత్ర రంగంలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత 1950లో 'షావుకారు' సినిమా హిట్ కావడంతో ఆమెకు షావుకారు జానకిగా పేరు వచ్చింది. ఆ తర్వాత అనేక సూపర్ హిట్ చిత్రాల్లో జానకి నటించారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో సుమారు 400 చిత్రాల్లో, 3 హిందీ సినిమాల్లోనూ, ఒక మలయాళ చిత్రంలో నటించి మెప్పించారు. సినీ రంగానికి ఆమె చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం ఆమెను 2022లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

**ఇల్లు గడవక నటిగా మారి.. షావుకారు జానకి జీవితమిది..**

'వద్దంటే డబ్బు', 'కన్యా శుల్కం', 'పిచ్చి పుల్లయ్య' , 'రేచుక్క-పగటిచుక్క, 'రోజులు మారాయి', 'సొంతవూరు', 'జయం మనదే', 'డాక్టర్ చక్రవర్తి', 'సంసారం ఒక చదరంగం', 'తోడికోడళ్ళు', 'బాబు బంగారం', 'గీతాంజలి' ఇలా అనేక హిట్ చిత్రాలలో జానకి నటించారు. చివరి సారి 'అన్నీ మంచి శకునములే'లో ఆమె కనిపించారు.

## కాంగ్రెస్ నేతలను విమర్శించలేదు

**మరోమారు రాజగోపాల్ రెడ్డి వివరణ**

**యాదాద్రిభువనగిరి,ఆగస్ట్21:**

కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తానుచేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. శుక్రవారం యాదాద్రి జిల్లాలోని చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాజ్‌గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. తానెక్కడా కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదని, విమర్శించనని రాజ్‌గోపాల్ రెడ్డి తేల్చిచెప్పారు. నిజమైన కాంగ్రెస్ నాయకులను అణిచివేస్తున్నారనే విషయాన్ని తాను గుర్తు చేశానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో భాగంగా ఉద్యమకారులకు గుర్తింపు ఉండాలని సూచించారు. సీమాంధ్ర పాలకులు, సీమాంధ్ర మీడియా చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం నడపవద్దని కోరారు. ప్రజాపాలన అంటే పేదల కోసం పని చేయాలని సూచించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు సీమాంధ్ర నాయకుల కోసం కాదని తెలిపారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.




## వైభవంగా వరలక్ష్మి పూజలు..

**మహాలక్ష్మికి మహిళల నీరాజనాలు**

**రాజేంద్రనగర్ వ్యాప్తంగా ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు,ప్రత్యేక పూజా కార్యక్రమాలు**

**రాజేంద్రనగర్,ఆగస్టు21:**

వరాలిచ్చే మహాలక్ష్మి మమ్మల్ని చల్లగా చూసి.. వరాలు ఇమ్మని వేడుకుంటూ మహిళలు పూజలు చేశారు.అమ్మ అనుగ్రహంతో ప్రతీఇంటా సిరిసంపదలు చేకూరుతాయని నిర్వహించే వరలక్ష్మి వ్రతాలు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో శుక్రవారం వైభవంగా సాగాయి.బస్తీల్లోని ఇళ్లలో మొదదలుకొని నియోజకవర్గం అంతటా ఆలయాల్లో భక్తులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు.అమ్మవారికి స్వాగత సూచికగా ఇళ్లముందు మహిళమనులు ముగ్గులుపెట్టి మామిడితోరణాలతో వరలక్ష్మికి ఘనస్వాగతం పలికారు.మహిళలు మహాలక్ష్మిదేవికి పంచామృతాభిషేకాలు నిర్వహించి వరలక్ష్మి వ్రతమహత్యాన్ని తెలుసుకున్నారు.ముత్తైదువులకు వాయనాలు ఇచ్చి పది కాలాల పాటు సుమంగళిగా ఉండే విధంగా ఆశీస్సులు అందుకున్నారు.వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని మహిళ మణులు ఉదయం నుంచే పూజాది కార్యక్రమాలకు ఉపక్రమించారు.కాగా,స్థానిక ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు.సర్కిల్ పరిధిలోని వాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయం,దుర్గామాత దేవాలయం,వెంకటేశ్వర స్వామి దేవాలయం, ఉమా రామలింగేశ్వర ఆలయం,మహాలక్ష్మి ఆలయంతో పాటు ఆలయాల్లో పూజలు కొనసాగాయి.యేడాదికి ఒకసారి సుహాసినులు ఈ వ్రతం చేయడం వల్లహకోరికలు నెరవేరుతున్నాయని పురోహితులు తెలిపారు.లక్ష్మిదేవిని పూజిస్తే సిరిసంపదలు చేకూరుతాయని మహిళలు విశ్వసిస్తారు.

## ఇస్నాపూర్ మున్సిపల్ సమగ్ర అభివృద్ధే లక్ష్యం




**ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత**

**రుద్రారం, పాశమైలారం, చిట్కుల్ వార్డుల్లో రూ.2.70 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**పటాన్ చెరు, ఆగస్టు 21 :**

ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రుద్రారం, పాశం మైలారం, చిట్కుల్ వార్డుల్లో సుమారు రూ.2.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగు నీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.మున్సిపాలిటీలోని ప్రతి వార్డును సమానంగా అభివృద్ధి చేయడంతో పాటు, కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తూ.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, మాజీ ఎంపీపీలు శ్రీశైలం యాదవ్, గాయత్రి పాండు, కౌన్సిలర్లు పాండు, సంధ్య నవీన్ రెడ్డి, లత వెంకటేష్, రాజు, ఆంజనేయులు, వెంకటేష్, అరుణ్, కో ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, బాబా, అసీయ బేగం, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుధీర్ రెడ్డి, కృష్ణ, రాజు, బండ రాజు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## రావోజీ తండలో ఫార్మ్ పాండ్ పనులకు శ్రీకారం

**– రైతు పొలంలో పనులు ప్రారంభించిన సర్పంచ్ బి. బాలు**




**కారేపల్లి, ఆగస్టు 21 (భద్రాద్రి న్యూస్ రాములు):** కారేపల్లి మండలం రావోజీ తండ గ్రామపంచాయతీ పరిధిలో రైతు లకావత్ శోభన్ పొలంలో మంజూరైన ఫార్మ్ పాండ్ పనులను గ్రామ సర్పంచ్ బి. బాలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బి. బాలు మాట్లాడుతూ ఫార్మ్ పాండ్ పనులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని కూలీలకు సూచించారు. బంజారా వీవో ద్వారా శుక్రవారం పనులకు సంబంధించిన డిమాండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కూలీలందరూ డిమాండ్ ఇచ్చి శనివారం పనులకు హాజరుకావాలని సూచించారు. ఈసీ సూచించిన కొలతల ప్రకారం పనులు చేపట్టాలని, ఫార్మ్ పాండ్ పనులకు సంబంధించిన విధి విధానాలను కూలీలకు వివరించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత కొలతల ప్రకారం పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, సాంకేతిక సహాయకుడు రాంబాబు, మాటే సుమన్, వార్డు సభ్యురాలు ఝూన్సీ, రైతు లకావత్ శోభన్, బంజారా వీవో మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ రాజీనామా చేయాలి

**- వరంగల్ కోర్టు ముందు న్యాయవాదుల నిరసన**

**వరంగల్, ఆగస్టు 21( భద్రాద్రిన్యూస్ ):** బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ చేస్తున్న అనుచిత చర్యల వల్ల బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గౌరవాన్ని, విశ్వసనీయతను, సంస్థాగత వైభవాన్ని కోల్పోయిందని వాటన్నింటి పునరుద్ధరించడానికి అడ్వకేట్స్ యాక్ట్ ప్రకారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను చట్టబద్ధంగా నడపటానికి బిసిఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా రాజీనామాను డిమాండ్ చేస్తూ వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయవాదులు కోర్టు ప్రధాన గేటు ముందు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో బాగంగా శుక్రవారం హనుమకొండలో జరిగిన నిరసనలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎ ఐ ఎల్ యు రాష్ట్ర కోశాధికారి ఎన్నంశెట్టి వేణుగోపాల్ రావు మాట్లాడుతూ న్యాయవాద వృత్తి నిలబెట్టాల్సిన రాజ్యాంగ విలువలకు కట్టుబడి పనిచేసే న్యాయవాదుల నిజమైన ప్రజాస్వామిక, స్వతంత్ర, ప్రాతినిధ్య సంస్థగా బిసిఐని చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా భ్రస్టు పట్టిస్తున్నాడని, ఏకపక్ష నిర్ణయాల వల్ల న్యాయవాదులకు రక్షణ కరువైందని అన్నారు. ఉన్నత విద్యా సంస్థ అయిన నల్సార్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించి కాబోయే న్యాయవాదుల భవిషత్ ను నాశనం చేయాలని చూసిన మనన్ కుమార్ మిశ్రా భారత బార్ కౌన్సిల్ చైర్మన్ పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనుచిత చర్యలకు పాల్పడి విద్యార్థులకు క్షమాపణ చెప్పిన మనన్ కుమార్ చైర్మన్ పదవికి అనర్హుడని అన్నారు. తన ఆదిపత్య ధోరణితో, పలుకబడితో, బిజెపి అండతో గత 14 ఏండ్లుగా చైర్మన్ గా కొనసాగుతూ తన వ్యక్తిగత నిర్ణయాలతో ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచి స్వీయ ప్రయోజనాలు పొందుతున్నారని విమర్శించారు. మనన్ కుమార్ బిజెపి పార్టీ తరుపున రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన కూడా బి సి ఐ చైర్మన్ పదవిని విడిచిపెట్టకుండా న్యాయవాద వ్యవస్థకే విలువ లేకుండా చేస్తున్నారని అన్నారు. ఆయన పరిధిలోకి రాని ముఖ్యమైన విషయాలైన పౌరసత్వ సవరణ చట్టం, ఆర్టికల్ 370 రద్దు, రైతు వ్యతిరేక చట్టాలపై ఆందోళన గూర్చి, వ్యవసాయ కార్మికుల ఆందోళన గూర్చి జారీ చేసిన ప్రకటనలు బిసిఐ విలువను దిగజారుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ దేశాన్ని పాలిస్తున్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా నడవాల్సిన వ్యవస్థలపై అజమాయిషీ చేస్తుందని అలాంటి దుర్మార్గ పాలన కొనసాగిస్తున్న బిజెపి కి వంత పాడుతూ బిసిఐ ని భ్రస్టు పట్టిస్తున్న చైర్మన్ మనన్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని అన్నారు. మనన్ కుమార్ రాజీనామా చేసే వరకు దేశ వ్యాప్తంగా పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. 1961 న్యాయవాదుల చట్టం కింద ఏర్పాటు చేసిన బి సి ఐ చట్టబద్ధమైన సంస్థ అని రాజ్యాంగ బద్ధంగా విధులను నిర్వహించి న్యాయవాదుల హక్కుల కోసం, రక్షణ కోసం పనిచేయాలని చైర్మన్ మనస్ కుమార్ అందుకు భిన్నంగా ప్రవర్తించడంతో దేశ వ్యాప్తంగా న్యాయవాదులు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. విభిన్న రాజకీయ భావాలున్న న్యాయవాదులకు నాయకత్వం వహించే బిసిఐ చైర్మన్ ఒక పార్టీకి, ఒక భావజాలానికి చెంది ఆ పదవిలో కొనసాగుతూ



తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. జంతర్ మంతర్ దగ్గర నిరసన తెలిపిన విద్యార్థులను దేశ వ్యతిరేక శక్తులని, దేశ ద్రోహులని మాట్లాడడం హేయమైన చర్య అని, ఆయన వెంటనే రాజీనామా చేసి బిజెపి కి ఊడిగం చేసుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎ ఐ ఎల్ యు రాష్ట్ర కమిటీ సభ్యులు సారంపల్లి మధుసూదన్ రెడ్డి, ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు జన్ను పద్మ, జిల్లా నాయకుడు పెండ్యాల అనిల్, జన్ను ప్రభాకర్, హనుమకొండ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రఘుపతి, ఐ ఎ ఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీమనాథం శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొత్తపల్లి చిరంజీవి, చంద్రమౌళి, మేడారపు రంజిత్, పాము రమేష్, న్యాయవాదులు అబ్దుల్ నబి, ఆనంద్, గంజి రమేష్, గంధం శివ, పూర్ణచందర్, భవాని ప్రసాద్, ప్రభంజన్, పూసపల్లి శ్రీనివాస్, యాకస్వామి, బండి మొగిలి, ఇజ్జగిరి సురేష్, మల్లేష్, విష్ణు వర్ధన్, వేములు రమేష్, బండి హరీష్, గురిమిల్ల రాజు, మర్రి రాజు, బానోత్ విజయ్, మేకల రంజిత్ తదితరులు పాల్గొన్నారు

# చిన్నారులే రేపటి భవిష్యత్.. వారికి అండగా నిలవాలి

**- ట్యూషన్ విద్యార్థులకు జ్ఞాపికగా కొత్త బట్టలు పంపిణీ**





**భద్రాద్రి న్యూస్ । ఆగస్టు 21 దమ్మపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం చంద్రయ్యపాలెం గ్రామంలో దాదాపు 30 మంది చిన్నారులకు శుక్రవారం కొత్త వస్త్రాలను పంపిణీ చేశారు. నాగుపల్లిలో నివాసం ఉంటూ చంద్రయ్యపాలెం గ్రామంలోని చిన్నారులకు కొంతకాలంగా ట్యూషన్ చెబుతున్న కందికొండ మధు.. తన విద్యార్థులకు జ్ఞాపికగా ఏదైనా అందించాలనే ఆలోచనతో తన స్నేహితుడు ఆర్ఎఫ్ఎస్ ఫౌండేషన్ అధినేత రవితో మాట్లాడారు. మధు ఆలోచనకు స్పందించిన రవి సహకారంతో చిన్నారులందరికీ కొత్త బట్టలను అందజేశారు. కొత్త వస్త్రాలు అందుకోవడంతో చిన్నారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్ఎస్ ఫౌండేషన్ అధినేత రవి మాట్లాడుతూ.. నేటి చిన్నారులే రేపటి భవిష్యత్ అని అన్నారు. వారిలోనే భవిష్యత్తులో అనేక మంది అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తనలాంటి స్వచ్ఛంద సేవకులు తయారవుతారని పేర్కొన్నారు. చిన్నారుల విద్యాభివృద్ధికి, వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవితో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్ఎఫ్ఎస్ స్థానిక బృందం సభ్యులు పాల్గొన్నారు.

# సిపిఎస్ రద్దు కోరుతూ ఛలో హైదరాబాద్

**- మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సి పి ఎస్(కంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కిం) ను వెంటనే రద్దు చేయాలి.. తుక్కాని శ్రీనివాస రెడ్డి**

**పాల్వంచ, ఆగస్టు 21 (భద్రాద్రిన్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న కొత్త పెన్షన్ విధానం ను రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలనే ఏకైక డిమాండ్ తో ఆగస్టు 23 ఆదివారం రోజు హైదరాబాదు నడిబొడ్డున ఉన్న లాల్ బహుదూర్ స్టేడియంలో లక్ష మంది ప్రభుత్వ సిపిఎస్ ఉద్యోగులతో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస రెడ్డి తెలియజేశారు..జూలై 11న భద్రాచలం నుండి సిపిఎస్ రద్దు కోరుతూ మొదలైన సిపిఎస్ ఉద్యోగుల జన జాగరణ యాత్ర లో రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాల్వల శ్రీకాంత్ గారు మరియు రాష్ట్ర కమిటీ మెంబర్స్ 33 జిల్లాలుగా 42 రోజులపాటు 110 మంది ఎమ్మెల్యేలు కలిసి సిపిఎస్ రద్దు కోరుతూ వినతి పత్రాలను అందిస్తూ యాత్రని జూన్ ఆగస్టు 18 తారీకున ముగించడం జరిగింది.. యాత్ర ముగింపు సందర్భంగా ఆదివారం రోజు ఆగస్టు 23 తారీకు హైదరాబాదులో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు దీనికి భద్రాద్రి జిల్లాలోని సిపిఎస్ ఉద్యోగు ఉపాధ్యాయ మిత్రులందరికీ భారీ సంఖ్యలో హాజరవ్వాలని శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. 2023 సాధారణ ఎన్నికలకు ముందు ఇప్పుడున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం మేము ప్రభుత్వం ఏర్పాటు చేస్తే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో దేశంలోని మిగతా కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో మాదిరిగా సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని వరంగల్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్




రెడ్డి గారు ప్రకటించడం జరిగింది. అలాగే సిపిఎస్ రద్దు చేస్తామని మేనిఫెస్టో లో కూడా పెట్టడం జరిగింది.మాట ఇచ్చిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఈ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు..

# జిల్లా లో వరలక్ష్మి వ్రతాలు ఇంటింటా వాయినాలు తొలి పూజకు వేలాయే





**కొత్తగూడెం, ఆగస్టు 21 (భద్రాద్రిన్యూస్ ):** జిల్లాలో వరలక్ష్మీ వ్రతాలు ఇంటింటా సంబరంగా జరిగాయి. లక్ష్మీదేవిని ఇంటికి ఇంటిలో అలంకరించుకొని తొమ్మిది రకాల నైవేద్యాలు చేసి చారి మతి చదలు చదువుకొని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. తెల్లవారుజాము నుండి వరలక్ష్మి పూజలు ప్రారంభం ఉదయం 5 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆడపడుచులు ఇంటింటికి వెళ్లి వాయనాలు తీసుకున్నారు.. తెలంగాణ ఆంధ్రలో తొలి సాంప్రదాయ వరలక్ష్మి వ్రతం ఆడపడుచులు ఎంతో చక్కగా పూజా కార్యక్రమంలో పాల్గొని ఆనందంతో గడిపారు.







## పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడొద్దు

**– జీవో 97ను వెంటనే రద్దు చేయాలి..**

**– 22న అశ్వారావుపేట నియోజకవర్గంలో నిరసనలు**



**భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । ఆగస్టు 21 :** పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్‌కు నష్టం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకర్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జీవో 97కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 22న అశ్వారావుపేట నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థి విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ నిరసన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.

# డిప్లొమా విద్యార్థులకు అన్యాయం చేసే జీవో 97ను ఉపసంహరించాలి

**- బీఆర్ఎస్ నాయకుడు లకావత్ లక్ష్మణ్ డిమాండ్**

**సింగరేణి, ఆగస్టు 21 (భద్రాద్రి న్యూస్ రాములు):** డిప్లొమా విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం. 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ దిశా కమిటీ సభ్యుడు లకావత్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సింగరేణి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ డిప్లొమా విద్యార్థుల స్థాయిని తగ్గిస్తూ, వారికి బీటెక్ విద్యలో ఉన్నత అవకాశాలను దూరం చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. డిప్లొమా విద్యార్థుల హక్కులను కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ వారి వెంట నిలబడుతుందని తెలిపారు. అవసరమైతే విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి, ప్రభుత్వం మెడలు వంచి న్యాయం సాధించే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో విద్య, సాంకేతిక రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందని లక్ష్మణ్ పేర్కొన్నారు. అప్పటి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ నాయకత్వంలో హైదరాబాద్‌కు అనేక ప్రముఖ సంస్థలను తీసుకువచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేశామని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యకు ప్రోత్సాహం అందించి తెలంగాణ యువత ప్రపంచస్థాయిలో పోటీపడేలా అవకాశాలు కల్పించామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల విషయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని లక్ష్మణ్ విమర్శించారు. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను నమ్మించి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలోనూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. ఆగస్టు 15 నాటికి రూ.2,400 కోట్ల రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని ప్రకటించి, విద్యార్థులకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థుల సమస్యలపై సానుకూలంగా స్పందించి జీవో నెం. 97పై పునరాలోచన చేయాలని, డిప్లొమా విద్యార్థులకు న్యాయం చేయాలని




లకావత్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. డిప్లొమా విద్యార్థులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, విద్యార్థులతో కలిసి వారి హక్కుల సాధన కోసం ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## వైరా లో సత్రం బజారు పనులు షురూ

*– వైరా లో 12, 13వ వార్డులో రోడ్లకు మరమ్మతులు షురూ*





**వైరా, ఆగస్టు 21, (భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ 12,13 వ వార్డులో వర్షాల కారణంగా గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు శుక్రవారం షురూ అయ్యాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముల్లపాటి సీతారాములు, సిబ్బంది కలిసి రోడ్లను పర్యవేక్షించి, మున్సిపల్ ఏఈ పలు సూచనలతో సత్రం బజార్ నుండి కె వి సి ఎం కాలేజీ వరకు ఎక్కడ గుంతలు ఉన్న ఆ ప్రదేశంలో కంకరతో నింపాలని ఆమె సూచించారు, బురద మయంతో ఉన్న రోడ్లను ప్రత్యేక శ్రద్ధతో మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ పరిశీలించటం పట్ల వార్డు ప్రజలు హర్ష వ్యక్తం చేశారు.

## దోమల నివారణకు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ ప్రత్యేక చర్యలు

*– గాదేపాడు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో విస్తృతంగా ఫాగింగ్*



**సింగరేణి, ఆగస్టు 21 (భద్రాద్రి న్యూస్ రాములు ):** సింగరేణి మండలం గాదేపాడు గ్రామపంచాయతీ పరిధిలోని ఒద్దుగూడెం, చర్లపల్లి, గాదేపాడు గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. శుక్రవారం ఫాగింగ్ యంత్రం ద్వారా దోమల మందును ఆయా గ్రామాల్లో విస్తృతంగా పిచికారి చేయించారు. సింగరేణి మండల సర్పంచుల అధ్యక్షుడు, గాదేపాడు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ దగ్గరుండి ఫాగింగ్ పనులను పర్యవేక్షిస్తూ ప్రతి వీధిలో దోమల మందు పిచికారి చేయించారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి పెరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని వీధుల్లో దోమల నివారణ చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ తెలిపారు. సర్పంచ్ స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులను పర్యవేక్షించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## దొడ్డ శేషు యాదవ్ మరణం తీరని లోటు

*– నివాళులర్పించిన మేకల మల్లి బాబు యాదవ్*



**కామేపల్లి,ఆగస్టు 21 (భద్రాద్రి న్యూస్):** అఖిల భారత యాదవ మహాసభ మాజీ ఖమ్మం నగర అధ్యక్షుడు, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు దొడ్డ శేషు యాదవ్ మృతి యాదవ సమాజానికి,కార్మిక రంగానికి తీరని లోటని డిసిసిబి డైరెక్టర్,యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లి బాబు యాదవ్ అన్నారు. ?అనారోగ్యంతో తను కన్నుమూసిన శేషు యాదవ్ భౌతికకాయానికి ఖమ్మంలోని ఆయన స్వగృహంలో మల్లి బాబు యాదవ్ పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సీనియర్ నాయకులను కలుపుకొని ఖమ్మం పట్టణంలో యాదవ సంఘాన్ని శేషు యాదవ్ ఎంతో సేవ చేసి బలోపేతం చేశారని గుర్తు చేసుకున్నారు. పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం కార్మికుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు అపురూపమైనవని కొనియాడారు. ?ఈ కార్యక్రమంలో యాదవ మహాసభ నాయకులు చంద్రకాని రమణ, 42వ డివిజన్ నాయకులు తోడేటి లింగరాజు,కోడి లింగయ్య,దొడ్డ సురేష్,దొడ్డ నరసింహారావు, తుపాకుల వెంకన్న, జె.శ్రీను,ఎ. గురుమూర్తి,ఎస్. వెంకన్న,కొండయ్య, దొడ్డ శ్రీను,దొడ్డ రమేష్,వల్లపు వీరయ్య,జి.లక్ష్మణ్, ముజాయుద్దీన్, నయీమ్ తదితరులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీకి కామేపల్లిలో ఏర్పాట్లు పూర్తి

**– ఐకెపి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం వెంకట రామారావు**







**కామేపల్లి,ఆగస్టు 21 (భద్రాద్రి న్యూస్):** కామేపల్లి మండలం కేంద్ర కార్యాలయం ఐటిపిలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళలకు అందించే యూనిఫాం చీరల పంపిణీ త్వరలోనే ప్రారంభం కానుందని అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం. వెంకట రామారావు తెలిపారు. ?ఈ పథకం కోసం ప్రభుత్వం నుంచి మండలానికి కేటాయించిన మొత్తం 15,000 చీరలు ఇప్పటికే చేరాయని ఆయన పేర్కొన్నారు. అజంతా మండల మహిళా సమైక్య కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పంపించిన ఈ చీరలను దిగుమతి చేసుకొని భద్రపరిచామని, త్వరలోనే అర్హులైన మహిళా సంఘాల సభ్యులందరికీ ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేస్తామని వెల్లడించారు. మహిళల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని వేగవంతం చేసిందని ఆయన తెలిపారు.

## భూముల రీ సర్వే అనంతరం అర్హులైన రైతులందరికీ పాస్ పుస్తకాలు

**నకిలీ పాస్ పుస్తకాలను రద్దు చేస్తాం: మంత్రి పొంగులేటి**



**జగిత్యాల, ఆగస్టు 21 (భద్రాద్రి న్యూస్):** భూముల రీ సర్వే అనంతరం అర్హులైన రైతులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకుంటామని, నకిలీ పాస్ పుస్తకాలను గుర్తించి రద్దు చేస్తామని రెవె న్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నకిలీ పాస్ పుస్తకాల ఆధారంగా అర్హతలేని వారంతా రైతుబంధు ప్రయోజనాలు పొందారని అన్నారు. భూ రీసర్వే అనంతరం నిజమైన రైతుల హక్కులను పరిరక్షిస్తూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. జగిత్యాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి భూమి పూజ చేశారు. జగిత్యాల నియోజకవర్గ ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో జరిగిన సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం జిల్లాకు 70 గ్రామాల్లో భూముల రీ సర్వే జరుగుతున్నదని, ఏడాదిన్నర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా రీ సర్వేను పూర్తి చేస్తామన్నారు.

## సన్ రైజ్ సంస్థ ద్వారా పాఠశాల విద్యార్థులకు టీ షర్ట్స్ పంపిణీ

**మధిర ఆర్సీ/చింతకాని (భద్రాద్రి న్యూస్):** బీజేపీ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు సుమన్ బాబు సోదరులు ఏనుగు కిరణ్ బాబు పుట్టినరోజు సందర్భంగా సన్ రైజ్ అభ్యుదయ సేవా సమితి వైరా వారి ఆధ్వర్యంలో చింతకాని మండలం లచ్చగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సుమారు పదిహేను వేల రూపాయల విలువైన టీ షర్ట్స్ ను పంపిణీ చేయటం జరిగింది . ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు సుమన్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన వస్తువులు పంపిణీ చేయటం చాలా ఆనందంగా ఉందని, అడిగిన వెంటనే స్పందించి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన సన్ రైజ్ సంస్థ వారికి ధన్యవాదాలు తెలిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాలతీ దాస్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు, అంగన్వాడీ కేంద్రాల్లో అవసరమైన వస్తువులు పంపిణీ చేయటం, నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేయటం, పేదింటి ఆడపడుచులకు పెళ్లి కానుక లాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని, ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడానికి తమ అమూల్యమైన సహాయ సహకారాలు అందిస్తున్న సంస్థ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఏనుగు కిరణ్ బాబు మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా ఇలా పిల్లల మధ్య గడిపే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని, పిల్లలు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గురువులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలకొండ సత్యనారాయణ



మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు, అంగన్వాడీ కేంద్రాల్లో అవసరమైన వస్తువులు పంపిణీ చేయటం తో పాటు అనేక విధాలుగా తమ సంస్థ ద్వారా సేవలను అందిస్తున్న సన్ రైజ్ సంస్థను అభినందించాల్సిందే, అలాగే భవిష్యత్తులో కూడా ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, గ్రామ పంచాయతీ కార్యవర్గ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## వైరాలో ఘనంగా భక్తి శ్రద్ధలతో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు

**- నైవేద్యం సమర్పించి లక్ష్మీదేవి వ్రతం చేసిన మహిళలు**

**వైరా, ఆగస్టు 21,( భద్రాద్రి న్యూస్ ) :** వైరా నియోజకవర్గ మండల అన్ని గ్రామాలలో మహిళలు శుక్రవారం శుక్రవారం ఉదయం 4 గంటల నుండి శ్రావణ శుక్రవారం భక్తిశ్రద్ధలతో మహిళలు ఘనంగా వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. వరలక్ష్మి వ్రతం కావడం వలన మహిళలు తమ తమ ఇంటిలో వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించి, శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రావణమాసంలో లక్ష్మీదేవి, అమ్మవారిని మనసారా పూజించి సకల సౌభాగ్యాలు కలగజేయాలని, మండపాలను, వివిధ రకాల పూలతో అలంకరించి, నైవేద్యాలు సమర్పించి, అమ్మవారికి పూజ నిర్వహించారు. వేకువజామున నాలుగు గంటల నుండి ఇల్లంతా శుభ్రం చేసి, అమ్మవారిని అలంకరించి, పిండి వంటలతో వంటలు చేసి, పూజా కార్యక్రమం నిర్వహించి, వరలక్ష్మీ వ్రత కథ విధానాన్ని అర్చకులు వారికి వివరించారు, వరలక్ష్మీ వ్రతం అంటే ఆచార్యులు వివరిస్తూ శ్రావణమాసం అంటేనే ఆధ్యాత్మికతకు, పూజలకు, వ్రతాలకు, మంగళకరమైన ఆచారాలకు, విశిష్టమైన మాసమని, ఈ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం శ్రీ వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించడం సనాతన సాంప్రదాయంలో విశిష్టమైన ఆచారంగా, కొనసాగుతుందని, మహిళలు ఈ వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. వర అంటే శ్రేష్టమైనది, వరాలను ప్రసాదించేది అనే భావం, అందువల్ల వరలక్ష్మి అనగా భక్తులకు శ్రేష్టమైన వరాలను ప్రసాదించే శ్రీ మహాలక్ష్మి స్వరూపం, శ్రీ వరలక్ష్మీ దేవిని భక్తితో ఆరాధించడం ద్వారా, సకల సౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు, సంతానం, ఐశ్వర్యం, ధన ధాన్య సమృద్ధి, కుటుంబ శ్రేయస్సు సుఖశాంతులు కలగాలని భక్తులు ప్రార్థిస్తారు. లక్ష్మి వ్రతం ప్రధానంగా ముత్తైదువులు, తమ కుటుంబ సౌభాగ్యం, ఆయురారోగ్యం, సంతానాభివృద్ధి, కుటుంబ సౌభాగ్యం, భర్త ఆయురారోగ్యం, అంతా







నా అభివృద్ధి, కుటుంబ క్షేమం కోసం భక్తిశ్రద్ధలతో ఆచరించే పవిత్రమైన వ్రతంగా ప్రసిద్ధి చెందింది, ఈ వ్రతాన్ని ముత్తైదువులు, ప్రత్యేకంగా ఆచరించే సాంప్రదాయం ఉన్నది. వరలక్ష్మి వ్రతానికి సంబంధించిన సాంప్రదాయ కథనంలో పార్వతీదేవి - పరమేశ్వరుల సంవాదం, అలాగే చారుమతి ప్రేమ కథకు ప్రముఖ స్థానం ఉన్నది అని స్కంద పురాణ సాంప్రదాయం ప్రకారం పార్వతి దేవి స్త్రీలకు శ్రేయస్సు కలిగించే వ్రతం గురించి పరమశివుని అండగా, శ్రీ వరలక్ష్మీ వ్రత విధానాన్ని శివుడి వివరించి, చారుమతి కథను చెప్పినట్లు పేర్కొనబడినది, అని అర్చకులు తెలిపారు. చారుమతికి శ్రీ మహాలక్ష్మి దేవి స్వప్నంలో దర్శనమిచ్చి వరలక్ష్మీ రూపంలో తనను ఆరాధించమని, అనుగ్రహించినట్లు ఆ కథను వివరిస్తుంది. కారుమతి భక్తిశ్రద్ధలను చూసి ఇతర స్త్రీలు కూడా ఆమెతో కలిసి వ్రతాన్ని ఆచరించినట్లు సాంప్రదాయం చెబుతుందని అర్చకులు తెలిపారు అనంతరం ముత్తయిదువులకు వాయనం ఇచ్చి పుచ్చుకున్నారు.

## ఒంటరితనం గుండె ఆరోగ్యానికి ప్రమాదమా?

**ఇంటర్నెట్ డెస్క్:** గుండె ఆరోగ్యం అంటే కేవలం కొలెస్ట్రాల్, రక్తపోటు లేదా రోజుకు ఎన్ని అడుగులు నడిచామన్నది కాదు. మన మానసిక ఆరోగ్యం, ఇతరులతో మనకున్న సంబంధాలు కూడా గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ధూమపానం, అతిగా ప్రాసెస్ చేసిన ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం, ఒంటరితనం, దీర్ఘకాలిక ఒత్తిడి వంటివి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని అంటున్నారు.

**ఒంటరితనం గుండె ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?**

ఒంటరితనం అంటే ఇంట్లో ఒంటరిగా ఉండటం మాత్రమే కాదు. మనసుకు దగ్గరైన వారితో మాట్లాడే అవకాశం లేకపోవడం, ఇతరులతో అనుబంధం లేకపోవడం కూడా ఒంటరితనంలోకి వస్తాయి. ఎక్కువ కాలం ఇలా ఒంటరిగా ఉంటే ఒత్తిడి పెరగడం, నిద్ర సరిగా లేకపోవడం, శారీరక శ్రమ తగ్గడం వంటి సమస్యలు రావచ్చు. ఇవన్నీ పరోక్షంగా గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. పరిశోధనల్లోనూ దీర్ఘకాలిక ఒంటరితనం, సామాజికంగా ఇతరులకు దూరంగా ఉండటం వల్ల గుండె జబ్బులు, పక్షవాతం వంటి సమస్యల ముప్పు పెరిగే అవకాశం ఉందని తేలింది.

**గుండె ఆరోగ్యం కోసం గుర్తుంచుకోవాల్సిన విషయాలు**

ధూమపానం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి.




అతిగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గించాలి.

రోజూ శారీరకంగా చురుకుగా ఉండాలి.

ఒంటరితనాన్ని నిర్లక్ష్యం చేయకుండా ఇతరులతో బంధాలు కొనసాగించాలి.

దీర్ఘకాలిక ఒత్తిడిని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి.

ఒంటరితనం ఒక్కటే గుండె జబ్బులకు కారణమవుతుందని కచ్చితంగా చెప్పలేం. గుండె జబ్బుల ముప్పుపై వయసు, వంశపారంపర్యం, రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, ధూమపానం, ఆహారం, శారీరక శ్రమ వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి. అయితే గుండె ఆరోగ్యం కేవలం ఆహారం, వ్యాయామంపైనే ఆధారపడదు. మానసిక ఆరోగ్యం, ఒత్తిడిని నియంత్రించుకోవడం, కుటుంబ సభ్యులు, స్నేహితులతో మంచి సంబంధాలు కొనసాగించడం కూడా మొత్తం ఆరోగ్యానికి ముఖ్యమే.